క్లుప్తంగా

కాంట్రాక్టు ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి

టేకులపల్లి: ప్రభుత్వ గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలో కాంట్రాక్టు ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం ఉమ్మడి జిల్లా సమన్వయ అధ్యక్షుడు గుగులోతు వీరన్న శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తొమ్మిది రోజులుగా ఐటీడీఏ భద్రాచలం కార్యాలయం ఎదుట గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ కాంట్రాక్ట్ ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో సమస్యలు పరిష్కరించాలని నిరవధిక సమ్మె చేస్తున్నారన్నారు. సర్వీసులు క్రమబద్ధీకరణ, 61 సంవత్సరాలు ఉద్యోగ భద్రతతో కూడిన మినిమం టైం స్కేల్ కల్పించాలని, మహిళలకు 180 రోజులు సెలవులు ఇవ్వాలని, మరణించిన లేదా పదవీ విరమణ పొందిన వారికి రూ.30 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని తదితర సమస్యల పరిష్కారానికి నిరవధిక సమ్మె చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు.

సూపర్‌బజార్లు ఏర్పాటు చేయాలి



ఎండీ శ్రీనివాస్‌తో మాట్లాడుతున్న రజాక్

సింగరేణి(కొత్తగూడెం): సత్తుపల్లి, రామవరం, త్రీ ఇంక్లైన్‌లో సూపర్‌బజార్లు ఏర్పాటు చేయాలని, ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్ సూపర్ బజార్ ఎండీ విలాస్ శ్రీనివాస్ పోతేదార్‌ను కోరారు. కొత్తగూడెం ఏరియాలో అత్యధిక బొగ్గు ఉత్పత్తి రావటానికి కారణమైన సత్తుపల్లిలోని పీవీఎస్ కాలనీలో 352 క్వార్టర్లలో కార్మికులు, వారి కుటుంబ సభ్యులు నివసిస్తున్నారని, వారి సౌకర్యార్థం సూపర్‌బజార్ ఏర్పాటు కోసం గతంలో రిప్రజెంటేషన్ చేయటం జరిగిందని, త్వరగా సత్తుపల్లి సూపర్ బజార్ ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. సూపర్‌బజార్‌లో పనిచేస్తున్న కాంటినెంటల్ హెల్పర్లను పర్మనెంట్ చేయాలని, సూపర్ బజార్‌లో అన్నిరకాల వస్తువులు ఏర్పాటు చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఎండీ సమస్యలను సంస్థ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్చిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్, డివిజనల్ మేనేజర్ చేతి అశోక్ పాల్గొన్నారు.

రివిజనిజాన్ని ఓడిద్దాం..



మాట్లాడుతున్న అశోక్ గయాల్

సింగరేణి(కొత్తగూడెం): ఆధునిక సరికొత్త రివిజనిజాన్ని ఓడిద్దామని, ప్రతిఘటన పోరాటాలను ముందుకు తీసుకెళ్దామని, చిట్టిపాటి ముఠా చేరికను న్యూడెమొక్రసీల ఐక్యతగా అభివర్ణించడం సిగ్గుచేటని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ నాయకులు అశోక్ గయాల్ అన్నారు. శనివారం సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని ఉర్దూఘర్ ఫంక్షన్ హాల్లో ఆ పార్టీ రాష్ట్ర నాయకులు ఆరెల్లి కృష్ణ అధ్యక్షతన రాష్ట్ర సభ నిర్వహించారు. గయాల్ మాట్లాడుతూ.. రెండు పార్టీల విలీనం పేరుతో వైకే న్యూడెమోక్రసీ ఎస్పీ చిట్టిపాడు తప్పుడు ప్రచారాన్ని తీవ్రంగా ఖండించారు. 1996, 2004 మహాసభలో పార్టీ ఆమోదించిన విధానాలకు వ్యతిరేకంగా విధానాలు రూపొందించుకున్న వైకే.. న్యూడెమోక్రసీ చంద్ర పుల్లారెడ్డి ప్రతిపాదించిన ప్రతిఘటన లైన్‌కు తిలోదకాలు ఇచ్చారని, వైకేకు న్యూడెమోక్రసీ పేరు పెట్టుకునే హక్కు లేదన్నారు. ఈ కార్యక్రమంలో బొక్కల భాస్కర్, కే.విశ్వనాథ్, మొగిలి ప్రతాప్‌రెడ్డి, పి.వరదయ్య తదితరులు పాల్గొన్నారు.

స్వెట్టర్లకు గిరాకీ



- పెరిగిన ఉన్ని దుస్తుల కొనుగోళ్లు
- కొత్తగూడెంలో మధ్యప్రదేశ్ వ్యాపారుల అమ్మకాలు



పోస్టాఫీసు సెంటర్‌లో స్వెట్టర్లు కొనుగోలు చేస్తున్న ప్రజలు

సండే స్పెషల్

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలో ఉష్ణోగ్రతలు పడిపోవడంతో చలి పెరిగింది. చాలామంది ఉదయం 9 గంటల తరువాత బయటకు రావడం, సాయంత్రం 6 అయితే ఇంటికే పరిమితమవుతున్నారు. ఈ క్రమంలో చలి నుంచి రక్షణ పొందేందుకు ప్రజలు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. చలి నుంచి రక్షించుకోవడానికి స్వెట్టర్ల కొనుగోలు చేస్తున్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా పట్టణంలోని వివిధ ప్రాంతాలలో స్వెట్టర్ల షాపులను ఏర్పాటు చేసి అమ్మకాలు చేస్తున్నారు. కొత్తగూడెం పట్టణంలో మధ్యప్రదేశ్ నుంచి దాదాపు 30 మంది వ్యాపారులు కుటుంబాలతో సహా వచ్చి స్వెట్టర్ల అమ్మకాలు చేస్తున్నారు. పోస్టాఫీసు, బస్టాండ్, సూపర్ బజార్ సెంటర్లలో దాదాపు 25కు పైగా షాపులను ఏర్పాటు చేసి వ్యాపారం చేస్తున్నారు. స్వెట్టర్ల అమ్మకాలు జనవరి వరకు కొనసాగిస్తామని వ్యాపారులు చెబుతున్నారు. అప్పటి వరకు షాపుల వెనుక భాగంలోనే తాత్కాలిక గుడారాలను ఏర్పాటు చేసుకున్నారు.

స్వెట్టర్ల ధరలు ఇలా...

పట్టణంలోని మూడు ప్రాంతాలలో మధ్యప్రదేశ్‌కు చెందిన వ్యాపారులు స్వెట్టర్ల అమ్మకాలు చేస్తున్నారు. రూ.650 నుంచి రూ.1000 వరకు అమ్ముతున్నారు. పిల్లలవి రూ.300 నుంచి ఉన్నాయి. బ్లాంకెట్స్ రూ.1000 నుంచి మొదలు రూ.2000 వరకు అమ్మకాలు చేస్తున్నారు. చెవులకు కట్టుకునేవి, మంకీ టోపీలు, చేతులకు గ్లౌజులను కూడా అమ్ముతున్నారు. స్థానికులు బాగా కొనుగోలు చేస్తుండడంతో ఉన్ని దుస్తులకు గిరాకీ ఏర్పడింది.



పిల్లల స్వెట్టర్లు కొనుగోలు చేస్తున్న మహిళ



రగ్గులు చూపుతున్న వ్యాపారి

ధర తక్కువగానే ఉన్నాయి..



కొత్తగూడెం పట్టణ పరిధిలో వివిధ ప్రాంతాలలో మధ్యప్రదేశ్ వారు అమ్మకాలు చేస్తున్న స్వెట్టర్లకు మంచి ఆదరణ ఉంది. ప్రజలు ఎక్కువ సంఖ్యలో కొనుగోలు చేస్తున్నారు. మూడు నెలల పాటు వినియోగించే స్వెట్టర్లకు ధరలు మామూలుగానే ఉన్నాయి. – జోషి, కొత్తగూడెం

ప్రతీ ఏడాది అమ్ముతున్నాం..



చలికాలంలో ప్రతీ ఏడాది కొత్తగూడెంలో షాపులను ఏర్పాటు చేసి స్వెట్టర్లను అమ్ముతున్నాం. మంచి ఆదరణ వస్తోంది. అన్నివర్గాల వారికి అందుబాటులో ధరలకు అమ్ముతున్నాం. మూడు నెలలు అమ్మకాలు కొనసాగిస్తాం. అనంతరం మా సొంత రాష్ట్రం మధ్యప్రదేశ్‌కు వెళ్తాం. – లక్ష్మణ్, రగ్గుల వ్యాపారి

రిజర్వేషన్లు అమలు చేయాలి



మాట్లాడుతున్న శ్రీనివాస్

కొత్తగూడెంఅర్బన్: స్థానిక ఎన్నికల్లో ఏజెన్సీ ప్రాంత ఎస్సీ కులాలకు జెడ్పీటీసీ, ఎంపీటీసీ రిజర్వేషన్ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట సమితి (ఎస్సీహెచ్‌పీఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు బొమ్మెర శ్రీనివాస్ అన్నారు. శనివారం కొత్తగూడెంలోని సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల కార్యాలయంలో జరిగిన సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో ఉమ్మడి జిల్లాలు ఖమ్మం, వరంగల్, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్ 4 జిల్లాలు 86 మండలాలు సుమారు 10 లక్షల జనాభా కలిగిన ఎస్సీ కులాలకు జెడ్పీటీసీ, ఎంపీటీసీ వార్డు సభ్యుల రిజర్వేషన్ లేకుండా జనరల్‌లో కలపడం వలన తీరని అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కలు ఏజెన్సీ ప్రాంత ఎస్సీ కులాలకు రాజకీయ రిజర్వేషన్‌తో పాటు ఉద్యోగం, ఉపాధి, ఎస్సీ రైతుల అసైన్మెంట్ సాగుభూములకు, పోడుభూములకు ఆంక్షలు లేకుండా హక్కు పత్రాలు ఇచ్చి రైతు భరోసా, రైతు రుణం, రైతు బీమా కల్పించాలని డిమాండ్ చేశారు. ఇల్లు లేని ఎస్సీ పేదలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేసి ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఏజెన్సీ ప్రాంత ఎస్సీ కులాలను గిరిజనేతరులుగా పరిగణిస్తూ అభివృద్ధికి దూరం చేయొద్దని ఖండించారు. తెలంగాణ రాష్ట్రంలో గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఏజెన్సీ ప్రాంత ఎస్సీ కులాలకు అన్యాయం, అవమానం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట సమితి రాష్ట్ర గౌరవ సలహాదారు సింగరేణి మైనింగ్ రిటైర్డ్ జీఎం అందెల ఆనందరావు, రాష్ట్ర ఆర్గనైజర్ ఎనగంటి కృపాకర్, సలిగంటి కొమరయ్య, కండె రాములు, ఇనుముల వెంకటేశ్వర్లు, మాదిగ జేఏసీ వ్యవస్థాపకులు చదలవాడ సూరి, మాదిగ ఐక్య సంఘాల వేదిక అధ్యక్షుడు వేల్పుల భాస్కర్, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు పూల రవీందర్, మేదిన లక్ష్మి పాల్గొన్నారు.

కులమతాలకు అతీతంగా మానవసేవ

కొత్తగూడెంఅర్బన్: కులమతాలకు అతీతంగా మానవసేవలో జమైతే ఇస్లామి హింద్ పని చేస్తుందని ఆ సంఘం రుద్రంపూర్ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ బాసిత్ అన్నారు. శనివారం వందమంది పేద, వృద్ధులకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో షమీం, రబ్బానీ, ఆలం, మదార్, తాజుద్దీన్, పర్వీన్, సన్షా, ఫాతిమా, షాహీన్, రహీం పాల్గొన్నారు.

పాల్వంచ: మండలంలోని పలు పాఠశాల విద్యార్థులకు గ్రేస్ సర్వీస్ సొసైటీ స్వచ్ఛంద సేవా సంస్థ ఖమ్మం ఆధ్వర్యంలో దుప్పట్లు, బొమ్మలను పంపిణీ చేశారు. శనివారం పట్టణ పరిధిలోని ఎర్రగుంట, పాలకోయతండా, శేఖరం బంజర, మంచికంటి నగర్, ప్రశాంత్ కాలనీ, కేటీపీఎస్ స్కూల్, పాత పాల్వంచ, వికలాంగుల కాలనీల్లో 1200 మంది విద్యార్థులకు దుప్పట్లు, తినుబండారాలు, బొమ్మలను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల చేతుల మీదుగా అందించారు. ఫౌండేషన్ నిర్వహకులు జాకోబ్, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

జూలూరుపాడు: బెండాలపాడు, మద్దుకూరు గ్రామాల్లో ఆదివాసీ గిరిజనులకు జూలూరుపాడు జేపీఆర్ ఫౌండేషన్ ట్రస్టు ఆధ్వర్యంలో సీఐ ఇంద్రసేనారెడ్డి చేతుల మీదుగా శనివారం రగ్గులు పంపిణీ చేశారు.



జూలూరుపాడు: రగ్గులు అందజేస్తున్న సీఐ

చుంచుపల్లి: రతన్ నవల్ టాటా పుట్టిన రోజు సందర్భంగా కొత్తగూడెం స్నేహలత, సంధ్యలత ఆశ్రమంలో శనివారం వృద్ధులకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టాటా ఏఐఏ బ్రాంచ్ మేనేజర్ మేనేజర్ సతీష్ జక్కుల మాట్లాడుతూ.. భారతదేశంలో అత్యంత విశ్వసనీయమైన 150 రకాల వ్యాపారాలు కలిగిన టాటా కంపెనీ ద్వారా ప్రజలకు సేవలను అందించటం అభినందనీయమన్నారు. రతన్ టాటా వివిధ కంపెనీల ద్వారా తనకు వచ్చిన లాభంలో 66శాతం వివిధ ట్రస్టుల ద్వారా పేదవారికి వివిధ రకాలుగా సేవలు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మానస, రాహుల్ ఆశ్రమం నిర్వాహకులు పాల్గొన్నారు.

ఇక మోడల్ మార్కెట్‌లోనే వ్యాపారాలు



సమావేశానికి హాజరైన చిరువ్యాపారులు

ఇల్లెందు: చిరు వ్యాపారులకు మోడల్ మార్కెట్‌లో గదులు కేటాయిస్తామని, పైరవీలకు తావుండదని ఎమ్మెల్యే కోరం కనకయ్య, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ అన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో గదుల కేటాయింపు సమావేశం జరిగింది. పట్టణంలోని కూరగాయలు, పూలు, పండ్లు, ఇతర చిరు వ్యాపారులు హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... పట్టణంలో రూ.9 కోట్లతో నిర్మించిన మోడల్ మార్కెట్‌లో 192 గదులు అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. దరఖాస్తులు స్వీకరించి లాటరీ పద్ధతిలో గదులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. గతంలో అదే మార్కెట్‌లో ఉన్న పాత వ్యాపారులకు గదులు కేటాయిస్తామన్నారు. మటన్, చికెన్, చేపల వ్యాపారంతోపాటు పూలు, పండ్లు ఇతర చిరు వ్యాపారులంతా ఒకేచోట ఉంటే వ్యాపారాలు బావుంటాయన్నారు. పట్టణంలో రోడ్డు వెడల్పు చేసి డివైడర్ నిర్మించినా చిరు వ్యాపారులు రోడ్ల మీద వ్యాపారం సాగించటం వల్ల ట్రాఫిక్ సమస్య వస్తోందన్నారు. కింది పోర్షన్‌లో ఒక్కో గదికి నెలకు రూ.2 వేలు, పై అంతస్థులో రూ.1500 కిరాయి, అడ్వాన్స్ రూ.10 వేలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. జనవరి 1 నుంచి షాపులు ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు.

వ్యాపారులను ఆదుకోవాలి..

మోడల్ మార్కెట్‌లో కింది పోర్షన్‌లోనే మటన్, చికెన్, పచ్చి చేపలు, ఎండు చేపల దుకాణాలకు గదులు కేటాయించాలని మాంసం విక్రయదారులు మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌లను కోరారు. శనివారం ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాగరాజు, నిసార్ అహ్మద్, అజీజ్, కళ్యాణ్ తదితరులు ఉన్నారు.

అస్తవ్యస్తంగా ఉపాధి పనులు



సామాజిక తనిఖీ సభలో సిబ్బందిని ప్రశ్నిస్తున్న అధికారులు

ఇల్లెందురూరల్: ఉపాధి హామీ పథకం అమలులోకి వచ్చి రెండు దశాబ్దాలు కావస్తున్నా నేటికీ పనుల తీరు, పర్యవేక్షణ అస్తవ్యస్తంగానే కొనసాగుతోంది. ఇందుకు మండలంలో శనివారం నిర్వహించిన ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ మండల మహాసభలో వెలుగుచూసిన అంశాలే ప్రత్యక్ష ఉదాహరణలుగా నిలుస్తున్నాయి. పలు గ్రామపంచాయతీలలో ఉపాధి హామీ పథకంలో భాగంగా వేల సంఖ్యలో మొక్కలు నాటితే ఒక్కటీ బతకలేదని సిబ్బంది బదులివ్వడం.. అందుకు తగినట్లుగానే ఆసక్తి ఉన్న రైతులకే మొక్కలు ఇవ్వాలని ఉన్నతాధికారులు సిబ్బంది సూచనలివ్వడం విచిత్రంగా ఉంది. పలు గ్రామపంచాయతీలలో పేరు ఒకరిది.. పనులు చేసింది మరొకరు అని వెలుగులోకి వచ్చింది. కనీసం కూలీలు చేసిన పనులకు వారం వారం ఇవ్వాల్సిన పే స్లిప్పులు కూడా ఇవ్వకపోవడం, చివరకు మస్టర్లను దిద్దడం వంటి పనులు ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపాన్ని చూపుతోంది. ఇక పోలారంలో పదిహేను రోజులపాటు కూలీలు పనులకు హాజరు కాకున్నా వేతనాలు మంజూరయ్యాయని, కొన్ని పంచాయతీలలో డిమాండ్ లేకున్నా పనులు చేపట్టారని, మన ఊరు – మన బడికి సంబంధించిన రికార్డులతోపాటు పంచాయతీరాజ్ శాఖ ద్వారా చేపట్టిన ఉపాధి పనులకు సంబంధించి రికార్డులను కూడా తమకు ఇవ్వలేదని సామాజిక తనిఖీ బృందం సభ్యులు ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చారు. మొత్తంగా 2023 మార్చి 31 నుంచి 2024 ఏప్రిల్ 1వ తేదీ వరకు రూ.3,82,43,561 విలువ చేసే పనులు చేపట్టగా అందులో సిబ్బంది నుంచి రూ.44,261 నిధులు రికవరీ చేయాలని, చేసిన తప్పులకు గాను రూ.20వేలు జరిమానా విధించినట్లుగా సామాజిక తనిఖీ ప్రత్యేకాధికారి, అడిషనల్ పీడీ రవికుమార్ ప్రకటించారు. కార్యక్రమంలో విజిలెన్స్ అధికారి రమణ, ఎంపీడీఓ ధన్‌సింగ్, ఎంపీఓ చిరంజీవి, ఏపీఓ శంకర్, సామాజిక తనిఖీ అధికారులు బృందం పాల్గొంది.

గ్రీన్ చానల్ ద్వారా వేతనాలు చెల్లించండి..

ఇల్లెందు: కేజీబీవీ, ఐటీడీఏలలోని సీఆర్‌టీలకు గ్రీన్ చానల్ ద్వారా వేతనాలు చెల్లించాలని టీపీటీఎఫ్ డిమాండ్ చేసింది. శనివారం ఇల్లెందులో టీపీటీఎఫ్ మండల కమిటీ సమావేశంలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.వెంకట్రాం, పి.సర్వేశ్వరరావు మాట్లాడుతూ.. ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. పీఆర్సీ 2020 ప్రకారం మినిమం టైమ్ స్కేల్ ఇవ్వాలని, గ్రీన్‌చానల్ ద్వారా ప్రతీనెల 1న వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ వేతనాలను వ్యక్తిగత ఖాతాల్లో జమ చేయాలని కోరారు. రెగ్యులర్ ఉపాధ్యాయులతో సమానంగా అన్నిరకాల సెలవులు వర్తింపజేయాలని, హెల్త్‌కార్డులు మంజూరు చేయాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని కోరారు. మరణించిన సీఆర్టీలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. సీఆర్‌టీలు సమ్మెలో ఉండటం వలన మార్చిలో వార్షిక పరీక్షల్లో విద్యార్థులకు నష్టం వాటిల్లుతుందన్నారు. సీఆర్టీలతో వెంటనే చర్చలు జరుపాలని కోరారు.

దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు

టేకులపల్లి: కులమతాలకు అతీతంగా టేకులపల్లి మండలం బేతంపూడిలోని హజరత్ సయ్యద్ జమాలుద్దీన్ బిహారీ బాబా దర్గా ఉర్సు వేడుకలు రెండోరోజు శనివారం కొనసాగాయి. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆనవాయితీలో భాగంగా దర్గా కమిటీ ఆధ్వర్యంలో రాత్రి దీపాలు వెలిగించారు.

భూనిర్వాసితులతో సమావేశం



మాట్లాడుతున్న పాల్వంచ ఎస్‌డీసీ కాశయ్య



హాజరైన భూనిర్వాసితులు

జూలూరుపాడు: సీతారామ లింక్ కెనాల్ నిర్మాణంతో భూములు కోల్పోయిన వినోభానగర్, జూలూరుపాడు గ్రామాలకు చెందిన భూనిర్వాసిత రైతులతో శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పాల్వంచ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కాశయ్య ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. కాశయ్య మాట్లాడుతూ.. జూలూరుపాడు – ఏన్కూరు మధ్య నిర్మిస్తున్న సీతారామ లింక్ కెనాల్‌తో 28 మంది రైతులు 29.14 ఎకరాల భూమి కోల్పోయినట్లు చెప్పారు. పట్టా భూములకు ఎకరానికి రూ.20 లక్షలు, పట్టాలు లేని భూములకు రూ.5 లక్షలు నష్టపరిహారాన్ని రాష్ట్రం ప్రభుత్వం చెల్లిస్తుందని చెప్పారు. ఈ నష్టపరిహారాన్ని అంగీకరిస్తూ తీర్మానంపై సంతకం చేయాలని రైతులను కోరారు. దీంతో పట్టాలు లేని రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ అందరికీ ఒకేవిధంగా నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. స్పందించిన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. పట్టా ఉన్న రైతులు నష్టపరిహారానికి అంగీకరిస్తూ అగ్రిమెంట్‌పై సంతకాలు చేశారు. గతంలో పలుమార్లు గ్రామసభలు నిర్వహించినా నష్టపరిహారం విషయంలో రైతులు అంగీకరించకపోవడంతో వాయిదా పడ్డాయి. తహసీల్దార్ కె.స్వాతిబిందు, కొత్తగూడెం ఇరిగేషన్ ఈఈ అర్జున్‌రావు, డీఈ చంద్రశేఖర్, జేఈ సాగర్, ఎస్‌డీసీ కార్యాలయ సిబ్బంది వర్సా లక్ష్మణ్, సుధాకర్ పాల్గొన్నారు.

జీపీ కార్మికులపై ప్రభుత్వం వివక్ష

చుంచుపల్లి: గ్రామ పంచాయతీ కార్మికులతో వెట్టిచాకిరీ చేయించుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం వారి సమస్యలను పరిష్కరించడంలో గత ప్రభుత్వం తీరునే ప్రదర్శిస్తూ వివక్ష ప్రదర్శిస్తోందని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కంచర్ల జమలయ్య ఆరోపించారు. డిమాండ్ల పరిష్కారం కోరుతూ కార్మిక సంఘాల జేఏసీ పిలుపు మేరకు బస్టాండు సెంటర్‌లో శనివారం నిరసన దీక్ష చేపట్టారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం జమలయ్య మాట్లాడారు. పారిశుద్ధ్య కార్మికుల న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని లేనిపక్షంలో నిరవధిక సమ్మె తప్పదని హెచ్చరించారు. మాచర్ల శ్రీనివాస్, ఎండీ యూసఫ్, దుంపల అమర్నాథ్, కిషోర్ కుమార్, రామకృష్ణ పాల్గొన్నారు.



ఇల్లెందురూరల్: దీక్షా శిబిరం వద్ద మాట్లాడుతున్న ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య



చుంచుపల్లి: మాట్లాడుతున్న జమలయ్య

సింగరేణి(కొత్తగూడెం): గ్రామపంచాయితీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీయూసీఐ జిల్లా కోశాధికారి పెద్దబోయిన సతీష్ డిమాండ్ చేశారు. గ్రామ పంచాయితీ ఉద్యోగ కార్మిక సంఘాల రాష్ట్ర జేఏసీ ఇచ్చిన 48 గంటల పిలుపులో భాగంగా రెండోరోజు కార్మికులు కొత్తగూడెం బస్టాండ్ చిల్డ్రన్స్ పార్క్ వద్ద సమ్మెలో కూర్చున్న గ్రామపంచాయితీ కార్మికులకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడారు.

జూలూరుపాడు: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన టోకెన్ సమ్మెలో భాగంగా శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట జీపీ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల జమలయ్య వీరికి సంఘీభావం తెలిపారు. జమలయ్య, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జేఏసీ నాయకులు వై.గోపాల్‌రావు, యాసా నరేష్ మాట్లాడుతూ... పంచాయతీ కార్మికుల బకాయి వేతనాలు చెల్లించాలని, వేతనాల కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చర్చలు జరపాలని, లేని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీఓ కరుణాకర్‌రెడ్డికి అందజేశారు. ఎస్కే చాంద్ పాషా, తంబర్ల నరసింహారావు పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: సమస్యలు పరిష్కరించాలని గ్రామపంచాయతీ కార్మికులు స్థానిక తహసీల్ ఎదుట శనివారం నిరసన దీక్ష చేపట్టారు. జేఏసీ నాయకులు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ముత్యాల విశ్వనాథం, ఏఐటీసీయూ నాయకులు బండి నాగేశ్వరరావు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు దొడ్డ రవికుమార్, పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి ఎండీ యూసుఫ్, అన్నారపు వెంకటేశ్వర్లు, సత్య, నిమ్మల రాంబాబు, తుల సీరాం, వేల్పుల రమేష్, శీలం భాస్కర్, నిరంజన్, భాస్కర్ తదితరులు దీక్షశిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు.

ఇల్లెందురూరల్: గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే కోరం కనకయ్య హామీ ఇచ్చారు. కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన టోకెన్ సమ్మెలో భాగంగా రెండోరోజు శనివారం కార్మికులు విధులు బహిష్కరించి మండల పరిషత్ కార్యాలయం వద్ద దీక్ష చేపట్టారు. ఎమ్మెల్యే శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. గ్రామపంచాయతీలు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వానికి అవగాహన ఉందని, సకాలంలో స్పందించి న్యాయం చేస్తుందని భరోసా కల్పించారు. కార్యక్రమంలో సారంగపాణి, అబ్దుల్ నబీ, జటంగి వెంకన్న, తోడేటి నాగేశ్వరరావు, దేవరకొండ శంకర్, మల్లెల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



జూలూరుపాడు: ధర్నా నిర్వహిస్తున్న జేఏసీ నాయకులు, కార్మికులు



పాల్వంచరూరల్: మాట్లాడుతున్న విశ్వనాథం



సింగరేణి(కొత్తగూడెం): మాట్లాడుతున్న సతీష్

ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడు మన్మోహన్‌సింగ్



ఇల్లెందు: నివాళులర్పిస్తున్న మహిళా నేతలు



ఇల్లెందురూరల్: నివాళులర్పిస్తున్న అధికారులు



టేకులపల్లి: కోయగూడెం ఓపెన్‌కాస్టులో..

ఇల్లెందు: భారత్ అన్నిరంగాల్లో అగ్రగామిగా నిలిచేలా మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలే కారణమని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. శనివారం ఇల్లెందులోని కొత్త బస్టాండ్ సెంటర్‌లో మన్మోహన్ సింగ్ సంతాపసభను నిర్వహించారు. 1,2,3 వార్డుల కాంగ్రెస్ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సభలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. కార్యక్రమంలో డానియేల్, మడుగు సాంబమూర్తి, బోళ్ల సూర్యం, చిల్లా శ్రీనివాసరావు, యదళ్లపల్లి అనసూర్య, కొక్కు నాగేశ్వరరావు, వారా రవి, పింగళి నరేష్, నీలం రమేష్, జి. సతీష్, వచ్చా వెంకన్న, మేకల శ్యామ్, గాలిపల్లి స్వరూప పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు మండలంలోని సెర్ప్ కార్యాలయంలో మండల పరిషత్, సెర్ప్, ఎన్ఆర్ఈజీఎస్, గ్రామపంచాయతీ అధికారులు శనివారం ఘనంగా నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపీడీఓ ధన్‌సింగ్ మాట్లాడుతూ.. దేశంలో మాజీ ప్రధాని పీవీ నర్సింహారావుతో కలిసి ఆర్థిక సంస్కరణలు తెచ్చిన ఘనత మన్మోహన్‌సింగ్‌కు దక్కుతుందని చెప్పారు. దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడంతోపాటు ప్రధానిగా పదేళ్లపాటు మంచి పాలన అందించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఏపీఎం దుర్గారావు, ఏపీఓ శంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

టేకులపల్లి: భారత మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్ మృతి దేశానికి తీరలని లోటని ఐఎన్‌టీయూసీ కోయగూడెం బ్రాంచి సెక్రటరీ భూక్యా నాగేశ్వర్‌రావు అన్నారు. ఈ మేరకు శనివారం ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో కేఓసీలో రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళి అర్పించారు. మాట్లాడుతూ... అనేక ఆర్థిక సంస్కరణలతో దేశాన్ని ముందుకు నడిపించిన ఆర్థిక వేత్త మన్మోహన్ సింగ్ అని కొనియాడారు. 2004 నుంచి 2014 వరకు ప్రధానిగా ఎన్నో ఆర్థిక సంస్కరణలు చేపట్టిన ఆయన ఐదు పర్యాయాలు రాజ్యసభ సభ్యుడిగాపని చేశారని, 1987 లో పద్మ విభూషణ్ అందుకున్న ఆయన 1991 నుండి 1996 వరకు ఆర్థిక మంత్రిగా సేవలుఅందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోయగూడెం పిట్ సెక్రెటరీ రాకం అశోక్, ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజు, పిట్, మైన్స్ కమిటీ సభ్యులు, వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.